www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
గురువారం
03 ఏప్రిల్ 2025

## విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు
జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను.
తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు..
సమకాలీన రాజకీయాలు, సామాజిక
అంశాలపై అవగాహన ఉండి..
రాయగల వారికి 'కలంజ్యోతి'
సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003



# వక్ఫ్ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

2లో

- వాడీవేడి చర్చ అనంతరం సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- అనుకూలం 288, వ్యతిరేకం 232
- బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్, ఎస్పీ, డీఎంకే తదితర విపక్షాలు
- బిల్లుకు వ్యతిరేకంగా ఓటేసిన వైఎస్సార్‌సీపీ ప్రతిని చించేసిన ఒవైసీ..
- నేడు రాజ్యసభ ముందుకు బిల్లు



మోదీ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న వక్ఫ్ (సవరణ) బిల్లు–2025ను లోక్‌సభ బుధవారం ఆమోదించింది. బిల్లుకు అనుకూలంగా 288, వ్యతిరేకంగా 232 ఓట్లు పడ్డాయి. అంతకుముందు బిల్లుపై 12 గంటల పాటు సుదీర్ఘంగా చర్చ జరిగింది. బిల్లు రాజ్యాంగ విరుద్ధమని విపక్ష ఇండియా కూటమి ఆరోపించగా పారదర్శకత కోసమేనని బీజేపీ ప్రభుత్వం సమర్థించుకుంది.

# చర్చలకు మేము సిద్ధం

- నక్సల్స్ కేంద్ర కమిటీ లేఖ విడుదల
- పలు షరతులు విధించిన మావోయిస్టులు



5లో

### నక్సల్స్ షరతులు..

- చర్చలకు సిద్ధమే.. సైనికులను శిబిరంలోనే ఉంచాలి
- నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్ లు పూర్తిగా ఆపివేయాలి
- కొత్త భద్రతా ఆపరేషన్‌లు చేపట్టకూడదు
- ఈ షరతులను అంగీకరిస్తే ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వస్తే శాంతి చర్చలకు సిద్ధమేనని నక్సల్స్ ప్రతినిధి ఆ లేఖలో ప్రకటించారు

- ఏప్రిల్ 30 వరకు అవకాశం ఇచ్చిన ప్రభుత్వం
- పథకం అమలు తర్వాత కొన్ని సాంకేతిక సమస్యలు
- అధికారులు పరిష్కరించే లోపే గడువు తేదీ ముగింపు
- గడువు పొడిగించాలని ప్రజల నుంచి వినతులు
- నెల గడువు పెంచిన ప్రభుత్వం

3లో



# ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పెంపు

# జీవిత ఖైదీ విధించాలి

## మంత్రి జూపల్లి కృష్ణారావు



కలంజ్యోతి, నాగర్ కర్నూల్ : నాగర్ కర్నూలు జిల్లా ఊరుకొండ పేట అభయాంజనేయ స్వామి దేవాలయ పరిసరాల్లో జరిగిన లైంగికదాడి నిందితులకు జీవిత ఖైదుతో పాటు అన్ని చట్టాలను ఉపయోగించి శిక్ష వేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాగర్ కర్నూల్ ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ ఘటన దురదృష్టకరమని అన్నారు. పబ్లిక్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, పోలీస్ సహారా ఏర్పాటు చేసి పోలీస్ నిఘా ఏర్పాటు చేయాలన్నారు.

# కేంద్రం సొమ్ముతో రాష్ట్ర ప్రభుత్వం సోకు..

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ బోగ శ్రావణి**



**కలంజ్యోతి, జగిత్యాల :** సొమ్ము కేంద్ర ప్రభుత్వానికి సోకు రాష్ట్ర ప్రభుత్వానిదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజకవర్గ ఇంఛార్జి డాక్టర్ బోగ శ్రావణి ఎద్దెవా చేశారు. బుధవారం శ్రావణి ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణతో సహా దేశవ్యాప్తంగా ఉన్న పేదలకు ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం ద్వారా ఉచితంగా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తుందని తెలిపారు. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేపట్టిన రేషన్ కార్డులపై ప్రధాని మోదీ ఫొటోను ముద్రించాలన్నారు. భారత ఆహార భద్రత చట్టం ప్రకారం నిరుపేదలకు కేంద్రం రూ.10వేల కోట్లు సబ్సిడీ ఇచ్చి ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తే అది రాష్ట్ర ప్రభుత్వం గొప్ప అని చెప్పుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు. పేదలకు ఇస్తున్న ప్రతి కిలో బియ్యం మీద కేంద్రం రూ.40 ఖర్చు చేస్తుందనే విషయాన్ని రేషన్ షాప్ ల వద్దకె వెళ్లి బీజేపీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసే కొత్త రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి ఫొటో సంబంధిత శాఖ మంత్రి ఫొటోతో పాటు ప్రోటోకాల్ ప్రకారం ప్రధానమంత్రి ఫొటో కూడా ముద్రించాలని శ్రావణి డిమాండ్ చేశారు.



# ఈఎన్టీల సేవలు అభినందనీయం

**జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్**

**కలంజ్యోతి, జగిత్యాల :** జిల్లాలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ల సేవలు అభినందనీయమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్ అన్నారు. బుధవారం జాతీయ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మాత శిశు సంరక్షణ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైద్య సిబ్బంది సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని 108 లో పనిచేసే సిబ్బంది అందిస్తున్న సేవలను కొనియాడారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందినీ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఏ శ్రీనివాస్, 108 జిల్లా కోఆర్డినేటర్ రాము, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ఇంచార్జ్ అసిస్టెంట్ డైరెక్టర్ కుమారస్వామి,ఆరోగ్య విద్యా బోధకులు కటుకం భూమేశ్వర్, తరాల శంకర్, ఆరోగ్య విస్తీర్ణ అధికారులు రాజేశం, శ్రీధర్ 108 సిబ్బంది పాల్గొన్నారు.




# వక్ఫ్ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ:** మోదీ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న వక్ఫ్ (సవరణ) బిల్లు-2025ను లోక్‌సభ బుధవారం ఆమోదించింది. బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 ఓట్లు పడ్డాయి. అంతకుముందు మధ్యాహ్నం 12 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల దాకా వాడీవేడీగా చర్చ కొనసాగింది. ముస్లింల ప్రయోజనాలను దెబ్బతీయడానికి మోదీ ప్రభుత్వం కుట్ర పన్నిందని విపక్షాలు మండిపడ్డాయి. బిల్లును అంగీకరించబోనంటూ హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సభలోనే బిల్లు ప్రతిని చించేశారు. అధికార ఎన్డీయే కూటమి ఎంపీలు బిల్లును సమర్థించారు. విపక్షాలవి ఓటు బ్యాంకు రాజకీయాలని ధ్వజమెత్తారు. వక్ఫ్ సవరణ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. ఎగువ సభలో చర్చకు 8 గంటల సమయం కేటాయించారు. అనంతరం బిల్లుపై ఓటింగ్ జరగనుంది. రాజ్యసభలోనూ అధికార ఎన్డీయేకు తగిన మెజార్టీ ఉండడంతో బిల్లు సులువుగా ఆమోదం పొందడం ఖాయంగా కనిపిస్తోంది.






### యూపీఏ పాపమే: రిజిజు

వక్ఫ్ (సవరణ) బిల్లు-2025ను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు బుధవారం మధ్యాహ్నం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం దానిపై సుదీర్ఘ చర్చ జరిగింది. బిల్లుకు అనుకూలంగా బీజేపీ సారథ్యంలోని అధికార ఎన్డీఏ, వ్యతిరేకంగా కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటముల మధ్య సంవాదం సభను వేడెక్కించింది. ముస్లింల ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని ఎన్డీఏ పక్షాలు పేర్కొనగా, బిల్లు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమంటూ విపక్షాలు తీవ్రంగా ఆక్షేపించాయి.

వక్ఫ్ బిల్లు పేరును ఉమ్మీద్ (యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫీషియన్సీ అండ్ డెవలప్‌మెంట్ -యూఎంఈఈడీ)గా మారుస్తున్నట్టు రిజిజు ప్రకటించారు. అనంతరం చర్చను ప్రారంభించారు. వక్ఫ్ బిల్లుకు తాము ప్రతిపాదిస్తున్న సవరణలే లేకపోతే పార్లమెంటు భూమిని కూడా వక్ఫ్ ఆస్తే అంటారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు భవనం, దాని పరిసర ప్రాంతాలు వక్ఫ్ ఆస్తుల్లో భాగమేనని ఆలిండియా ముస్లిం డెమొక్రటిక్ ఫ్రంట్ (ఏఐయూడీఎఫ్) చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ గతంలో వ్యాఖ్యలు చేశారు. వాటినుద్దేశించే మంత్రి ఇలా మాట్లాడినట్టు చెబుతున్నారు. ఈ బిల్లు కేవలం వక్ఫ్ ఆస్తుల నిర్వహణకు సంబంధించిన విషయమే తప్ప ముస్లింల మత విశ్వాసాల్లో ఎలాంటి జోక్యమూ చేసుకోబోదని ఆయన స్పష్టం చేశారు. ‘‘వక్ఫ్ బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ సంఘం వేసి అత్యంత సుదీర్ఘంగా చర్చలు, సంప్రదింపులు జరిపాం. జేపీసీ సూచించిన పలు సవరణలకు అంగీకరించాం. అయినా విపక్షాలు అవాస్తవాలతో ప్రజలను తప్పుదోవ పట్టించజూస్తున్నాయి. వక్ఫ్ చట్టానికి యూపీఏ హయాంలో చేసిన మార్పుల వల్ల దానికి విపరీతమైన అధికారాలు దఖలు పడ్డాయి. వక్ఫ్ చట్టాన్ని ఇతర చట్టాలకు అతీతంగా మార్చేశాయి. అందుకే ఈ సవరణలు తప్పనిసరయ్యాయి’’ అని రిజిజు అన్నారు. ఏ మత సంస్థల వ్యవహారాల్లోనూ తమ ప్రభుత్వం వేలుపెట్టబోవడం లేదని చెప్పారు. ‘‘ప్రపంచంలోకెల్లా అత్యధిక సంఖ్యలో వక్ఫ్ ఆస్తులున్నది భారత్‌లోనే. వాటిని పేద ముస్లింల సంక్షేమానికి మాత్రమే వినియోగించాలి. అలా జరిగేలా చూడటమే బిల్లు లక్ష్యం. దీనికి మద్దతిస్తున్నదెవరో, వ్యతిరేకిస్తున్నదెవరో దేశం ఎన్నటికీ గుర్తుంచుకుంటుంది’’ అని చెప్పారు. కాంగ్రెస్ తరఫున గౌరవ్ గొగొయ్ మాట్లాడుతూ రిజిజు వాదనను తీవ్రంగా ఖండించారు. బిల్లును రాజ్యాంగ మౌలిక స్వరూపంపైనే దాడిగా అభివర్ణించారు. రిజుజు చర్చకు బదులిచ్చారు. మైనారిటీలకు భారత్‌ను మించిన సురక్షితమైన దేశం ప్రపంచంలోనే లేదన్నారు. అత్యల్ప సంఖ్యాకులైన పార్సీలు కూడా సగర్వంగా నివసిస్తున్నట్టు చెప్పారు.

### అంతా అంగీకరించాల్సిందే: అమిత్ షా

వక్ఫ్ బిల్లు విషయమై దేశంలో అయోమయం సృష్టించేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. ముస్లింలను భయపెట్టడం ద్వారా వారిని ఓటు బ్యాంకుగా మార్చుకున్నాయంటూ దుయ్యబట్టారు. ఈ బిల్లు ముస్లింల మత సంబంధిత అంశాల్లో వేలు పెడుతుందన్న ఆరోపణలను మంత్రి తోసిపుచ్చారు. ‘‘ఈ సవరణలను మైనారిటీలు ఒప్పుకోరని కొందరంటున్నారు. భారత ప్రభుత్వం, పార్లమెంటు చేస్తున్న చట్టమిది. దీన్ని ప్రతి ఒక్కరూ అంగీకరించి తీరాల్సిందే’’ అని కుండబద్దలు కొట్టారు. ‘2014 లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ నాటి కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ సర్కారు వక్ఫ్ చట్టానికి హడావుడిగా రాత్రికి రాత్రి అడ్డగోలు సవరణలు చేసింది. తద్వారా దాన్ని చట్టాలకు అతీతంగా మార్చింది. లేదంటే ఈ సవరణ బిల్లు అవసరముండేదే కాదు’’ అని అమిత్ షా అన్నారు.

‘యూపీఏ నిర్ణయం వల్ల ఢిల్లీలోని ల్యూటెన్స్ జోన్‌లో ఏకంగా 123 ఆస్తులు కేవలం 25 రోజుల వ్యవధిలో వక్ఫ్ ఆస్తులుగా మారిపోయాయి. ఇలాంటి దారుణమైన అవకతవకలను సరిదిద్దడం, వక్ఫ్ భూములు, ఆస్తుల నిర్వహణ పూర్తిగా ప్రజాస్వామికంగా, పారదర్శకంగా జరిగేలా చూడటమే తాజా బిల్లు ఉద్దేశం. అంతేతప్ప ఓటుబ్యాంకు కోసం చట్టాలు చేయడం మోదీ సర్కారుకు అలవాటు లేదు’’ ని స్పష్టం చేశారు.

పౌరుల వ్యక్తిగత, ప్రభుత్వ ఆస్తులన్నింటినీ ఎట్టి పరిస్థితుల్లోనూ పరిరక్షించి తీరతామని చెప్పారు. ‘‘కేవలం వక్ఫ్ ఆస్తి అని ప్రకటించినంత మాత్రాన ఎవరి భూమీ వక్ఫ్ భూమిగా మారకుండా తగిన రక్షణలను ఈ బిల్లు కల్పిస్తుంది’’ అని వివరించారు. అనంతరం బీజేపీతో పాటు విపక్షాల నుంచి పలువురు సభ్యులు బిల్లుపై అర్ధరాత్రి దాకా సుదీర్ఘంగా మాట్లాడారు. అనంతరం ఓటింగ్ ద్వారా బిల్లు ఆమోదం పొందింది. తర్వాత దానికి విపక్షాలు పలు సవరణలు ప్రతిపాదించగా అవన్నీ ఒక్కొక్కటిగా వీగిపోయాయి.

### చర్చకు రాహుల్ గైర్హాజరు
### సోదరి, వయనాడ్ ఎంపీ ప్రియాంక కూడా

కీలకమైన వక్ఫ్ (సవరణ) బిల్లుపై లోక్‌సభలో జరిగిన చర్చకు, ఓటింగ్‌కు విపక్ష నేత రాహుల్‌గాంధీ గైర్హాజరయ్యారు. ఆయన సోదరి, వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ కూడా బుధవారం సభకు హాజరు కాలేదు. బిల్లుపై అనుసరించాల్సిన వ్యూహంపై ఉదయం సభలో ఆయన పార్టీ ఎంపీలతో చర్చించారు. దాంతో బిల్లుపై కాంగ్రెస్ తరఫున చర్చకు రాహులే సారథ్యం వహిస్తారని భావించారు. కానీ చర్చలో పాల్గొనరాదని రాహుల్ నిర్ణయించుకున్నారు. పార్లమెంటు ప్రాంగణం నుంచి నిష్క్రమించారు. ప్రియాంక కూడా చర్చలో పాల్గొనకపోవడం విశేషం. కాంగ్రెస్‌కు కేటాయించిన గంటా 40 నిమిషాల సమయంలో గౌరవ్ గొగొయ్ తదితర పార్టీలే ఎంపీలే మాట్లాడారు.

# ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పెంపు

**కలంజ్యోతి, హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకంలో రాయితీ గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగించింది. పాత ప్లాట్ల రిజిస్ట్రేషన్ కోసం ప్రజలకు మరో అవకాశం కల్పించారు. మునుపటి రాయితీపై ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వం ఆశించిన మేర పౌరులు ఎక్కువగా స్పందించలేదు. సాంకేతిక సమస్యలు కూడా తలెత్తాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ రాయితీ గడువును మరో నెల రోజుల పాటు పొడిగించింది. ఇప్పటి వరకు 4 లక్షల మంది దరఖాస్తుదారులు రూ.1200 కోట్ల వరకు ఫీజు చెల్లించారు.



**ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పొడిగింపు..**

తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) రాయితీ గడువును పొడిగించింది. ఏప్రిల్ 30 వరకు అవకాశం కల్పించింది. గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రజలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తూ ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది ప్రభుత్వం. మొదట మార్చి 31వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఆ లోపు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన వారికి 25 శాతం మేర రాయితీ ప్రకటించారు. అయితే ఈ గడువు ముగిసింది. కొత్త ఆర్థిక సంవత్సరం కూడా మొదలైంది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే రాయితీపై ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినా ఆశించినంత మేర రిజిస్ట్రేషన్లు జరగలేదు. ప్రజల నుంచి ప్రభుత్వం అనుకున్న మేర స్పందన కూడా రాలేదు. దానిలో భాగంగానే.. మరో సారి ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు గడువును పొడిగించింది.

**ప్రభుత్వానికి ఇప్పటికే రూ.1200కోట్ల ఆదాయం..**

ఇప్పటి వరకు 4 లక్షల మంది దరఖాస్తుదారులు రూ.1200 కోట్ల వరకు ఫీజు చెల్లించారు. పథకం అమలు తర్వాత కొన్ని సాంకేతిక సమస్యలు కూడా ఎదురయ్యాయి. దానిని అధికారులు పరిష్కరించే లోపే గడువు తేదీ సమీపించింది. దాంతో వరుసగా ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో చివరి రెండు రోజులు కార్యకలాపాలు సాగలేదు. ఈ నేపథ్యంలో గడువు పొడిగించాలని ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తడంతో.. వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఓటీఎస్‌ను మరో నెల రోజులు పొడిగించింది.

**ఆర్థిక సంవత్సరం చివరి రోజున కూడా..**

2024-25 ఆర్థిక సంవత్సరం చివరి రోజున అంటే మార్చి 31న 43,700 మంది ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ఫీజు చెల్లించారు. ఆ ఒక్క రోజే ఫీజు కింద దాదాపు రూ.124 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు అధికారాలు తెలిపారు. అయితే ఈ గడువు పొడిగిస్తూ ప్రభుత్వం బుధవారం నిర్ణయం తీసుకోగా.. ఏప్రిల్ 1వ తేదీన కూడా ఎల్ఆర్ఎస్ కింద ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు 25 శాతం రాయితీని వర్తింపజేశారు.

## అనుమతులు లేని ఆస్పత్రులను సీజ్ చేయాలి

### కలెక్టర్ కు రవితేజ గౌడ్ ఫిర్యాదు



**కలంజ్యోతి, వేములవాడ :** సరైన అనుమతులు లేకుండా తగిన అర్హత లేని, అద్దె డాక్టర్లతో హాస్పిటల్లను నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రైవేట్ ఆస్పత్రులను సీజ్ చేయాలని కోరుతూ టీపీసీసీ లీగల్ డిపార్ట్మెంట్ కన్వీనర్ బుర్ర రవితేజగౌడ్ బుధవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ.. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా, అర్హత లేని అరకొర సిబ్బంది, సదుపాయాలతో, పరిమితికి మించిన పడకలు ఏర్పాటు చేసి, నాసిరకం వైద్యం చేస్తున్న ఆస్పత్రులపై తక్షణమే తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల ఒకరు ఉదయం అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రికి వస్తే చేయాల్సిన ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించకపోవడం వల్ల సాయంత్రం గుండెజబ్బుతో మృతిచెందారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవించే హక్కు రాజ్యాంగం కల్పిస్తున్నందున, ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని, ప్రమాణాలు పాటించని అనుమతులు పొందని సంబంధిత ఆస్పత్రులను తక్షణమే నివారించాలని ఫిర్యాదు చేశారు.



## పాపన్నగౌడ్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

### సంగారెడ్డి జిల్లా కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు ఆశన్నగౌడ్

**కలంజ్యోతి, నర్సాపూర్ :** బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ స్ఫూర్తితో ముందుకెళ్లాలని సంగారెడ్డి జిల్లా కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఆశన్న గౌడ్ పిలుపునిచ్చారు. పాపన్న 315 వర్ధంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ముందు ఉన్న పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆశన్నగౌడ్, రమేష్ గౌడ్ మాట్లాడారు. బహుజనుల రాజ్యం, జన హక్కుల కోసం పోరాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీలకు 52 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గీత కార్మికుల సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేల కోట్లతో కార్పొరేషన్ ద్వారా గౌడ యువతీయువకులకు ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో నిర్మల జగ్గారెడ్డి, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగాన్నగౌడ్, నాయకులు రవిగౌడ్, యాదగౌడ్, విట్టల్ గౌడ్, వంశీ, బీరయ్య యాదవ్, కృష్ణగౌడ్, శ్రీనివాస్ గౌడ్, హరీష్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, పవన్ గౌడ్, మనీష్‌గౌడ్, శ్రీధర్ గౌడ్, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



### సన్నబియ్యం పంపిణీ

## పేదలకు గొప్ప వరం

### కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బత్తిని నారాయణ

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మండలలోని రహీంఖాన్ పెట్ గ్రామంలో సన్నబియ్యం పంపిణీని కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బత్తిని నారాయణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదల పెన్నిధి సీఎం రేవంత్ రెడ్డి, మానకొండూర్ ఎమ్మెల్యే, ఆరోగ్య ప్రదాత డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రజాపాలనలో భాగంగా పేద ప్రజలకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం రాష్ట్రంలో ప్రారంభించినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దొంతి మల్లయ్య, మాజీ ఏఎంసీ డైరెక్టర్ బత్తిని మల్లయ్య, నాయకులు కుస రవీందర్, కాముటం కనుకయ్య, నర్ల శ్రీనివాస్, గడ్డమీది వీరేశం, చిక్కుడు వెంకటేష్, కాముటం నారాయణ, డీలర్ రాజు, తాడూరి రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.



### ఘనంగా వేంకటేశ్వర స్వామి

## బ్రహ్మోత్సవాలు

### మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్

**కలంజ్యోతి, నర్సాపూర్ :** కౌడిపల్లి మండలం వెల్మకన్య గ్రామంలో బుధవారం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారిని మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్ దర్శించుకున్నారు. ప్రతి ఏటా జరిగే బ్రహ్మోత్సవాల్లో గ్రామస్తులు అందరు కలిసి నిర్వహించుకోవడం మన ఐక్యత చిహ్నం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ రాజేందర్ పటేల్, గుండం శంకర్, నర్సాపూర్ అధ్యక్షుడు నాగేష్, దాసు, రాములు నాయక్, అశోక్, రాజు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అత్త సొమ్ము.. అల్లుడు దానం

### బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కమలాకర్



**కలంజ్యోతి, నర్సాపూర్ :** ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం ద్వారా గత ఐదు సంవత్సరాలుగా ప్రధాని నరేంద్రమోదీ పేదల ఆకలి తీర్చేందుకు ఉచితంగా ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో రేషన్ బియ్యం అందిస్తున్నారని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కమలాకర్ అన్నారు. కరోనా కష్టకాలం నుంచి 5 కిలోల బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఇస్తుండగా అదనంగా ఒక కిలో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తూ మొత్తం తామే ఇస్తున్నామని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేట్టన్నారు. ఉచిత రేషన్ పథకం 2028 వరకు కొనసాగనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించిన విషయాన్ని కమలాకర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.



## పాపన్నగౌడ్ కు ఘన నివాళి

### జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్.లత

**కలంజ్యోతి, జగిత్యాల :** సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ కు జిల్లా అదనపు కలెక్టర్ ఘన నివాళులర్పించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి కార్యక్రమంలో బీఎస్ లత పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్, గౌడ సంఘ ప్రతినిధులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

### మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా అందజేత

**కలంజ్యోతి, నర్సాపూర్ :** శివంపేట మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ వాటర్ మాన్ బ్యాగరి కిష్టయ్య తండ్రి అనారోగ్యం కారణంతో మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన బెస్త బాలమణి భర్త బాలేష్ అన్నారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకుడు, మాజీ జడ్పీటీసీ, పబ్బ మహేష్ గుప్తా ఆ బాధిత కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.5వేలు, నెలకు సరిపడే నిత్యవసర సరుకులు అందజేశారు . ఆయా కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొగ్గుల యాదగిరి, కుమ్మరి శంకర్, అశోక్, సెట్ విజయ్, రవీందర్ గౌడ్, బొగ్గుల శ్రీనివాస్, బొగ్గుల కుమార్, బాలేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## 7న వీర హనుమాన్ విజయయాత్ర

**కలంజ్యోతి, జగిత్యాల :** ఈ నెల 7న విశ్వాహిందూ పరిషత్ భజరంగ్దళ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వీర హనుమాన్ విజయయాత్రకి మాలదారులు, భక్తులు ఆహ్వాన కార్యక్రమంలో భాగంగా 1వ వార్డులో హనుమాన్ దేవాలయం, తహశీల్ చౌరస్తా వద్ద వీర హనుమాన్ విజయయాత్ర కరపత్రాలను పట్టణంలోనీ 1వ వార్డులో హనుమాన్ దేవాలయం వద్ద భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కుసరి అనిల్, కుమార్, చీట్ల గంగాధర్, సింగం గంగాధర్, నారేందుల శ్రీనివాస్, వేముల పొచమల్లు, ఎడమల వెంకట్ రెడ్డి, బండారి మల్లికార్జున్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు కాంగ్రెస్ పార్టీనే ఆర్థిక భరోసా

### మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి



**కలంజ్యోతి, జగిత్యాల :** నిరుపేదలకు పని కల్పించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం తీసుకువచ్చి, కూలీలకు ఆర్థిక భరోసా కల్పించిందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో బుధవారం జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. యూపీఏ హయాంలో చైర్ పర్సన్ సోనియాగాంధీ నేతృ త్వంలో ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఎటువంటి ఆంక్షలు లేకుండా అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఉపాధి హామీ చట్టం ప్రవేశపెట్టారని వివరించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం నిరుపేదలకు వరం గా మారిందన్నారు. పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో ఉపాధి కూలీలకు రోజు వారు కూలీ రూ.400 చెల్లిస్తుండగా, తెలంగాణ రాష్ట్రంలో మాత్రం రూ.300 చెల్లిస్తున్నారు. కూలీలకు చెల్లిస్తున్న రోజు వారి కూలీ రేటు రూ.300లను ఈ ఏడాది నుంచి మరో రూ.7లు పెంచి, రూ.307 చెల్లిస్తున్నప్పటికీ కూలీలకు గిట్టుబాటు కావడం లేదన్నారు. గతంలో ఉపాధి హామీ కూలీలకు వేసవి భత్యం మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మే మాసాల్లో 30 శాతం చెల్లించారన్నారు. ఉపాధి హామీ కూలీలకు రోజువారీ కూలీ రేటు రూ.400లకు పెంచడంతో పాటు ఎండ తీవ్రత దృష్ట్యా వేసవి భత్యం ఏప్రిల్, మే మాసాలకు గానూ 30 శాతం అదనంగా కల్పించేందుకు కేంద్రానికి నివేదించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ కూలీలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు తెలంగాణ రాష్ట్రం ఇందిర మ్మ ఆత్మీయ భరోసా కింద నెలకు రూ.1000 చొప్పున సంవత్సరానికి రూ.12000 చెల్లిస్తున్నదని పేర్కొన్నారు. వ్యవసాయ పొలాలకు సాగునీరు అందించే ఎస్సారెస్పీ కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగి, మట్టి, చెత్త చెదారం పేరుకుపోవడంతో ఉపాధి హామీ పనుల్లో భాగంగా కాలువల మరమ్మ తులకు నిర్మాణాత్మక కార్యాచరణ రూపొందించి, వేసవిలో పనులు ప్రారంభించాలన్నారు. వ్యవసాయ కూలీల సమస్య ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం తన బాధ్యతగా భావించి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి లేఖ రాస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో నీటి సంఘాల అవశ్యకత ఉన్నది. ప్రభుత్వ ఆలోచన కూడా చేస్తున్నదన్నారు. ఉపాధి హామీ కూలీలకు వేసవి భత్యం కల్పించేందుకు సీఎం ప్రత్యేక చొరవ తీసుకోవాలని జీవన్ రెడ్డి కోరారు.

# సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై 2025 పరిశోధన

### బీవీఆర్ఐటీలో అభివృద్ధి 3వ ఎడిషన్ ప్రదర్శన





**కలంజ్యోతి, నర్సాపూర్ :** బీవీఆర్ ఐటీ-2025 నర్సాపూర్ పరిశోధన, అభివృద్ధి సెల్ 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాల వైపు 2025 ' అనే అంశంపై దృష్టి సారించి ఆర్అండ్ డీ ప్రదర్శన 3వ ఎడిషన్ ను నిర్వహించింది. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో 14 విభాగాల నుంచి 500 కంటే ఎక్కువ విద్యార్థి ప్రాజెక్టులు ఆవిష్కరణ, విద్యా నైపుణ్యాన్ని ప్రదర్శించాయి. విద్యార్థుల కెరీర్‌లను నిర్మించడంలో, సామాజిక పురోగతికి దోహదపడడంలో విద్యా పరిశోధన ప్రాముఖ్యతను హైలైట్ చేసిన ఐఐసీటీ, హైదరాబాద్‌లోని చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.శ్రీధర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు, అధ్యాపకులలో ప్రభావవంతమైన పరిశోధనలను పెంపొందించడంలో సంస్థ నిబద్ధతను బీవీఆర్ఐటీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మీప్రసాద్ హైలైట్ చేశారు. బీవీఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే సంస్థ పరిశోధన విజయాలను, దాని అత్యాధునిక ఆవిష్కరణ సంస్కృతిని జరుపుకున్నారు. బీవీఆర్ ఐటీ బలమైన పరిశోధనా సంస్కృతిని నిర్మించడానికి జాతీయ, అంతర్జాతీ య సంస్థలతో కొనసాగుతున్న సహకారాన్ని ఎస్‌వీఈసీ - ఆర్ అండ్ డీ డీన్ డాక్టర్ రాజు ఏడ్ల చర్చించారు. స్పాన్సర్డ్ రీసెర్చ్ డీన్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ విద్యార్థులు తమ పరిశోధన ప్రయత్నాలను మరింతగా పెంచుకోవాలని సూచించారు. బీవీ ఆర్ఐటీలో పరిశోధన, ప్రచురణల పెరుగుతున్న ప్రాముఖ్యతను ఆర్ అండ్ డీ అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్.పిచ్చై హైలైట్ చేశారు. అన్ని విభాగాల హెచ్ఓడీలు, డీన్‌లు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. బీవీఆర్ ఐటీ నర్సాపూర్‌లో బలమైన పరిశోధనా పర్యావరణ వ్యవస్థను నిర్మించడంలో నిరంతర మద్దతు ఇచ్చినందుకు నాయకత్వ బృందం యాజమాన్యానికి కేవీ విష్ణు రాజు (ఛైర్మన్), రవిచంద్రన్ రాజగోపాల్ (వైస్‌చైర్మన్), ఆదిత్య విస్సం (కార్యదర్శి), అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బాపిరాజు కృతజ్ఞతలు తెలిపారు.

# చర్చలకు మేము సిద్ధం

**రాయ్ పూర్ :** ఎట్టకేలకు కేంద్ర హోమ్ శాఖ కఠిన వైఖరి, మరో వైపు ఉద్దీపన చర్యలతో నక్సలైట్లు కాల్పుల విరమణ కోరుతున్నట్లు బుధవారం లేఖ విడుదల చేశారు. చర్చలకు తాము సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఇటీవల నక్సల్స్ కు తగులుతున్న వరుస ఎదురు దెబ్బల వల్ల నక్సల్స్ కేంద్ర కమిటీ సమావేశమైంది. అనంతరం ప్రతినిధి ఒకరు బుధవారం కరపత్రాన్ని విడుదల చేసి శాంతి చర్చలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఆపరేషన్ ను ఆపేందుకు సిద్ధంగా ఉంటే తాము చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు లేఖలో పేర్కొన్నారు. కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా బస్తర్ పర్యటనకు ముందు ఈ లేఖ విడుదల కావడం విశేషం. కాల్పుల విరమణ అనంతరమే షరతులతో కూడిన శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్ ను ఆపాలని కేంద్రాన్ని అభ్యర్థించారు. ఏడాదిన్నరలో సుమారు 400మందికిపైగా సహచరులను కోల్పోయామని నక్సల్స్ కేంద్ర



కమిటీ ప్రకటించింది. సీఎం విజయ్ శర్మ కోరినట్లు ప్రధాన జన జీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు.


**4న రాయ్‌పూర్‌లో షా సమావేశం..**

మరో వైపు నక్సల్స్ సమస్యపై భద్రతాధికారులతో చర్చించేందుకు కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా ఛత్తీస్ గఢ్ లోని రాయ్ పూర్ లో పర్యటనకు రానున్నారు. రాత్రికి అక్కడే బస చేయనున్నారు. ఏప్రిల్ 5న నక్సల్స్ ప్రభావిత జిల్లా దంతెవాడ వెళ్లనున్నారు. దంతేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం బస్తర్ పాండుం కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తరువాత భద్రతాదళ ఉన్నతాధికారులు, కమాండర్లతో సమావేశం నిర్వహిస్తారు. ఆ తరువాత రాయ్ పూర్ కు తిరిగి వచ్చి పరిపాలనా సమావేశం నిర్వహిస్తారు. ఈ సమావేశంలో రక్షణ దళాల ఉన్నతాధికారులు, నిఘా వర్గాలు పాల్గొంటాయి. ఈ సమావేశం అనంతరం నక్సల్స్ తో తుది నిర్ణయాత్మక పోరుకు భద్రతా దళాలు నడుం బిగించనున్నట్లు సమాచారం.

# రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

## కొలను హనుమంత్ రెడ్డి

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని 7, 8, 9 డివిజన్లలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలో ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, కుత్బుల్లాపూర్ కోఆర్డినేటర్ ఉజ్మా షాకీర్, టీపీసీసీ







ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్బంగా హన్మంతన్న మాట్లాడుతూ జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గొప్ప కార్యక్రమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికీ ప్రజల వద్దకు వెళ్లి స్వాతంత్ర పోరాటంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు స్వాతంత్రం వచ్చిన తరువాత దేశంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు అందించిన అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా, దేశంలో బీజేపీ ప్రభుత్వం ఏ విధంగా రాజ్యాంగాన్ని అవమానిస్తూ కించపరుస్తూ వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేస్తూ, అప్రజస్వామిక నిర్ణయాలు తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నగేష్‌చారి, మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ జీవన్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కడియాల ఇందిర, మధుసూదన్ రెడ్డి, సురేష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, చౌదరి, ప్రవీణ్, కుమార్ యాదవ్, సురేష్ యాదవ్, జగన్ యాదవ్, శ్రీశైలం యాదవ్, రవి, నాని, వర్మ రాజు, రమేష్, మల్లికార్జున్, గంగాధర్, శ్రీనివాస్, విష్ణు, చిరంజీవి, వాసు, వీరబాబు, రఫాత్, హరియా నాయక్, రాజేందర్, రామ్ చందర్ నాయక్, సాయి, లోకనాథ్, మురళి కృష్ణ, అరవింద్, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, మధు, భూపతి కుమార్, కోటేశ్వర్, రాధా, నవ్య, సురేందర్ రెడ్డి, రవీందర్, హరిబాబు, రఘు, సురేష్, చిన్న కుమార్ యాదవ్, శ్రీనివాస్, బాలాజీ, శ్రీ రామ్ రెడ్డి, తులసి దాస్, మౌళీశ్వర్, శ్రీనివాస్, నారాయణ రెడ్డి, రుత్విక్, చింకు, నాగరాజు, జ్యోతి, విజయ్, మురళి, రామ, వెంకటేష్ పటేల్, లక్ష్మణ్, హరీష్, గౌస్, శరత్, యశోద, గిరిజ కుమారి, శ్రీదేవి,హేమ రెడ్డి, సునీత, నగిన, కరుణ, కోటేశ్వరి పాల్గొన్నారు.



## సబ్బండ వర్గాల సంక్షేమమే

# రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

### మార్కెట్ కమిటీ చైర్మన్ చేలకల తిరుపతి

**కలంజ్యోతి, రుద్రంగి :** రాష్ట్రంలోని అన్ని రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ దేశంలోనే ప్రథమమని, సబ్బండ వర్గాల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం అని రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి, మండల అధ్యక్షుడు తుమ్ జలపతి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పథకాన్ని రుద్రంగి మండలంలోని దేగావత్ తండా, బడి తండా గ్రామాల పరిధిలో గల రేషన్ దుకాణంలో బుధవారం ఆయన సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...దేశంలో ఎక్కడా లేనివిధంగా మొట్టమొదటిసారిగా రాష్ట్రంలోని రేషన్ లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉగాది రోజున ప్రారంభించారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ మేరకు పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడు సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా వివిధ పథకాలు అమలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమ్ముల రవీందర్, గ్రామ శాఖ అధ్యక్షుడు జూల దిలీప్, నాయకులు గంగా నర్సయ్య, జక్కు మోహన్, జక్కు వంశీ, జక్కుల శ్రీనివాస్, జక్కుల లక్ష్మీ నర్సయ్య, గురుదాస్ నాయక్,గంగాధర్, అంబర్ సింగ్,బంకట్ లాల్,రాజు,తిరుపతి,మాజీ సర్పంచ్,దెగవత్ తిరుపతి,మహిళలు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ముదిరాజ్ సంఘం యూత్ కార్యవర్గం ఎన్నిక

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** జవార్ పేట గ్రామంలో ముదిరాజ్ సంఘం యూత్ కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా గంగాధర వరుణ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా జెట్టి ఆదర్శ్ కుమార్, కోశాధికారిగా జెట్టి క్రాంతికిరణ్ ను ప్రకటించారు. ఈ ఎన్నికకు సహకరించిన వారందరికీ ముదిరాజ్ యూత్ సభ్యులందరూ కృతజ్ఞతలు తెలిపారు.



## మల్యాలలో సన్నబియ్యం పంపిణీ

**కలంజ్యోతి, మల్యాల :** మండలంలోని నుకపల్లి గ్రామంలో సన్నబియ్యం పంపిణీ చేశారు. మల్యాల కేంద్రంలోని రేషన్ దుకాణంలో కటుకం వినయ్ షాప్ బియ్యం పంపిణీ చేయగా లబ్ధిదారులు జవ్వాజి రాధ, ఎల్లమ్మ, హర్షం వ్యక్తం చేశారు. ఒక్కో కుటుంబానికి సన్నబియ్యం సుమారు 20 కిలోల బియ్యంను పంపిణీ చేయగా లబ్ధిదారులు వెయ్యి రుపాయాలు ఆదా అవుతాయని పేర్కొన్నారు. సన్నబియ్యం కొనుడు తప్పిందని ఆనందపడ్డారు. సోనియామ్మాకు, సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



## దేశంలో ఎక్కడా లేని విధంగా
# సన్నబియ్యం పంపిణీ

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

### లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

**కలంజ్యోతి, మల్యాల :** మండలంలోని నూకపల్లి గ్రామంలో బుధవారం సివిల్ సప్లయి అధికారులు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు . అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేపట్టినట్లు పేర్కొన్నారు. సన్నబియ్యం ద్వారా ఒక్కో కుటుంబానికి దాదాపుగా రూ.1500 లాభం అవుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, గత ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి తేడా గమనించాలని కోరారు. అనంతరం 45 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బీఎస్ లతా, ఆర్డీవో మధుసూదన్ గౌడ్, జిల్లా సివిల్ సప్లయి అధికారి జితేందర్ రెడ్డి, తహసీల్దార్ మునీందర్, ఎంపీడీవో స్వాతి, ఎంపీఓ ప్రవీణ్, సీఐ నీలం రవి , కాంగ్రెస్ నాయకులు ఆనందరెడ్డి, దారం ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, శనిగారపు తిరుపతి, నేరెళ్ల సతీష్ రెడ్డి, కొండ బత్తిని అనిల్ కుమార్, తాళ్ల హరినాథ్, మిస్త్రీ శ్రీను, జలం, కటుకం వినయ్ తదితరులు పాల్గొన్నారు.



## మహనీయుల చరిత్రలను
# భావితరాలకు అందించాలి

### కలెక్టర్ కుమార్ దీపక్



**కలంజ్యోతి, మంచిర్యాల :** బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాడిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని, మహనీయుల చరిత్రలను భావితరాలకు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ. పురుషోత్తం, జిల్లా అధికారులతో హాజరై పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్రెడ్డి, జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, సాంఘిక సంక్షేమశాఖ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**మహనీయుల జయంతి ఉత్సవాల నిర్వహణపై సన్నాహక సమావేశం**

జిల్లాలో ఈ నెల 5, 14 తేదీలలో నిర్వహించనున్న మహనీయుల జయంతి ఉత్సవాల నిర్వహణపై ఈ నెల 3వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎఫ్-3 లో గల జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి పోటు రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి, ఈ నెల 14వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134వ జయంతి కార్యక్రమాల నిర్వహణ కోసం జిల్లాలోని వివిధ దళిత సంఘాల ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి



**కలంజ్యోతి, మంచిర్యాల :** ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ లో గల పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ అనారోగ్య సమస్యలపై ఆస్పత్రులకు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, వేసవికాలం అయినందున వడదెబ్బ నుండి కాపాడుకునేందుకు పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

### ఎక్కటి రఘుపాల్ రెడ్డి

**కలంజ్యోతి, వీణవంక :** మండల కేంద్రంలోని వల్భాపూర్ గ్రామంలో బుధవారం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని రఘుపాల్ రెడ్డి అన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు సన్నబియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పర్యావరణ పరిరక్షణ సమితి హుజురాబాద్ అధ్యక్షులు జీడి తిరుపతి, మాజీ ఎంపీటీసీ జీడి దేవేందర్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ శ్రీపతి రెడ్డి, నాయకులు సదాశివరెడ్డి, అందె కుమార్, రేషన్ డీలర్లు ఎలుక హరినాథ్ రెడ్డి, మారముల్ల శ్రీనివాస్ ఉన్నారు.



Cinema కలంజ్యోతి
గురువారం 03.04.2025



# అదే నాకు నచ్చలేదు

యంగ్ హీరోయిన్ షాలిని పాండే 'అర్జున్ రెడ్డి' సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి వచ్చింది. ఇటీవల ఈ భామ 'డబ్బా కార్టెల్' అనే వెబ్ సిరీస్‌తో ప్రేక్షకులను అలరించింది. కొద్ది రోజుల నుంచి షాలిని పాండేను బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్‌తో పోలుస్తూ కొంతమంది పలు పోస్టులు షేర్ చేస్తున్నారు. తాజాగా, ఈ విషయం షాలిని స్పందించింది. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ అమ్మడు 'ప్రేక్షకులు నన్నెంతగానో ప్రేమిస్తున్నారు. నేను వారి ప్రేమను వెలకట్టలేను. కానీ కొంతమంది నన్ను ఆలియాభట్‌తో పోలుస్తూ తమ ప్రేమను తెలియజేస్తున్నారు. మనకు ఇండస్ట్రీలో ఇప్పటికే ఒక ఆలియా ఉన్నది. కాబట్టి ఆమెలా మరొకరు అవసరం లేదని నా అభిప్రాయం. ఆమెలా ఉండాలని వేరొకరు అనుకోరు. ఎందుకంటే, ఆమె అద్భుతమైన నటి అందంగా కూడా ఉంటుంది. సినిమాల్లోనే కాదు నిజ జీవితంలోనూ ఆమె ఎంతో ఉన్నతంగా ఉంటారు. నేను కూడా ఆమె నుంచి ఎంతో స్ఫూర్తి పొందుతుంటా. ఎన్నో విషయాలు నేర్చుకోవాలనుకుంటాను. అయితే ఆమెతో పోల్చి చూస్తుంటే మాత్రం పెద్దగా నచ్చడం లేదు. ప్రేక్షకులు నన్ను నాలా గుర్తిస్తే చాలు. నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనేది నా కోరిక" అని తెలిపింది.

